ఆరోగ్య తెలంగాణ సాధనకు కృషి చేస్తాం

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



తుమ్మేటి రఘోత్తమరెడ్డి మిద్దెతోట పురస్కారాలను ప్రదానం చేస్తున్న తుమ్మల నాగేశ్వరరావు

నాంపల్లి: రైతు నేస్తం ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం రెడ్‌హిల్స్‌లోని ఫెడరేషన్ హౌస్ సురానా ఆడిటోరియంలో రైతు నేస్తం-23 మిద్దెతోట అవార్డుల ప్రదానోత్సవ సభ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హాజరై ప్రసంగించారు. పసుపు, ఉప్పు, కారంతో పాటుగా అన్ని రకాల ఆహార పదార్థాలు కల్తీ అవుతున్న నేపథ్యంలో ఈ కల్తీని అరికట్టేందుకు మిద్దెతోటల నిర్వహణకు మహిళలు ముందుకు రావాలని తుమ్మేటి రఘోత్తమరెడ్డి మిద్దెతోట పురస్కారాల ప్రదానోత్సవ సభలో పిలుపునిచ్చారు. మిద్దె తోటలకు సంబంధించి ప్రభుత్వం రాయితీలు, ప్రోత్సాహకాలను కొనసాగించే ప్రయత్నం చేస్తామని చెప్పారు. అంతేకాకుండా వారికి నిరంతరం సలహాలు, శిక్షణ ఇచ్చే అవకాశం కూడా ప్రభుత్వం పరిశీలిస్తోందని చెప్పారు. ముఖ్యంగా ప్రభుత్వం ప్రారంభించిన రైతు నేస్తం కార్యక్రమంలో మిద్దె తోటలు అంశాన్ని కూడా చేర్చి ఆరోగ్య తెలంగాణకు కృషి చేస్తామని అన్నారు. మహిళలు అంతా మిద్దెతోటలు మీద దృష్టిపెట్టి ఇంటిల్లిపాదికి అవసరమైన కూరగాయలు, పండ్లు పండిస్తూ తోటివారికి పంచుతూ ముందుకు సాగాలని సూచించారు. ఈ సందర్భంగా రైతు నేస్తం వెంకటేశ్వరరావును అభినందిస్తూ వారి సేవా కార్యక్రమాలను మరింతగా విస్తరించాలని ఆశీస్సులు అందించారు. రైతు నేస్తం పేరుతో రైతు వేదికలన్నింటిని సమన్వయ పరుస్తూ వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తల సహకారంతో మార్చి 6న ప్రభుత్వం రైతుల సాగు సమస్యలకు పరిష్కారం చూపించే ప్రత్యేక కార్యక్రమం ప్రారంభించిందని మంత్రి పేర్కొన్నారు. అనంతరం తుమ్మేటి రఘోత్తమరెడ్డి రైతు నేస్తం పురస్కారాలను ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన 24 మందికి అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ కిసాన్ సెల్ జాతీయ ఉపాధ్యక్షులు ఎం.కోదండరెడ్డి, రైతు నేస్తం ఫౌండేషన్ చైర్మన్ యడ్లపల్లి వేంకటేశ్వరరావు, మిద్దెతోట నిపుణులు తుమ్మేటి రఘోత్తమరెడ్డి, పి.పద్మ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నాళ్లో వేచిన ఉదయం..!

- ఏడేళ్ల ఎదురు చూపులకు తెర..
- అన్ని కారిడార్ల లాగే పాతబస్తీలో కూడా పరుగులు తీయనున్న మెట్రో
- నేడు ఫలక్‌నుమాలో పనులకు సీఎం శంకుస్థాపన
- ఫలించిన ఓల్డ్ సిటీ మెట్రో రైలు జేఏసీ పోరాటం



ఫలక్‌నుమాలో మెట్రో శంకుస్థాపన కోసం ఏర్పాట్లు

చార్మినార్: ఏడేళ్లుగా మెట్రో కోసం ఎదురు చూసిన పాతబస్తీ ప్రజలకు శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డి రూ.2 వేల కోట్లతో ఫలక్‌నుమాలో మెట్రో పనులకు శంకుస్థాపన చేస్తుండడంతో ఊరట లభించనుంది. ఇక పాతబస్తీలో మెట్రో రైలు ప్రాజెక్ట్ పనులకు మోక్షం కలుగుతుందని భావించిన పాతబస్తీ ప్రజల ఆశ నెరవేరుతుంది. గతంలో పాతబస్తీలో మెట్రో పనులు చేపట్టక పోవడం పట్ల పెద్ద ఎత్తున నిరసనలు వెల్లువెత్తాయి. మెట్రో రైలు సాధన కోసం ఏర్పడిన ఓల్డ్ సిటీ మెట్రో రైల్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో గతంలో పలు నిరసన కార్యక్రమాలతో పాటు ఆందోళనలను ఉధ్రుతం చేశాయి. మజ్లిసేతర పార్టీలన్నీ ఏకమై 2017 నవంబర్ 21న నాయకులందరూ జాయింట్ యాక్షన్ కమిటీగా ఏర్పాటయ్యారు. అప్పటి అధికార పార్టీ అయిన బీఆర్ఎస్‌తో పాటు అన్ని పార్టీల నాయకులు ఈ జేఏసీలో ఉండి మెట్రోను సాధించుకోవడం కోసం ఆందోళనలు చేపట్టారు.

చకచకా పనులకు శ్రీకారం..

ఎంపీ అసదుద్దీన్ ఒవైసీతో పాటు మజ్లిస్ పార్టీ ఫ్లోర్ లీడర్ అక్బరుద్దీన్ ఒవైసీలు కూడా పాతబస్తీలో మెట్రో రైలు పనులను వెంటనే ప్రారంభించాలని కోరారు. ఒకటి రెండు సార్లు అధికారులతో కలిసి పాతబస్తీలో పర్యటనలు నిర్వహించారు. మళ్లీ 2023 ఎన్నికల వచ్చాయి. ఎన్నికల ప్రచారం సందర్భంగా మెట్రో రైలు ప్రస్తావన వచ్చింది. ఫలితాలు వెలువడి తమ ప్రభుత్వం వచ్చిన వెంటనే పాతబస్తీలో మెట్రో పనులు ప్రారంభమవుతాయని కాంగ్రెస్ పార్టీ అధిష్టానం హామీ ఇచ్చింది. అనుకున్నట్లుగానే పాతబస్తీ మెట్రో రైలు ఏర్పాటుపై సీఎం రేవంత్‌రెడ్డి సానుకూలంగా ఉండి వెంటనే పనులను ప్రారంభించాలని మెట్రో ఎండీకి చెప్పడం..పవర్ పాయింట్ ప్రజెంటేషన్ జరగడం..నిధులను కేటాయించడం..శంకుస్థాపన చేయడం చకచకా జరిగిపోతున్నాయి.

చెప్పింది చేసే ప్రభుత్వం మాది



సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చినట్లుగానే శుక్రవారం మెట్రో రైలు పనులకు శంకుస్థాపన జరుగుతుంది. గత ప్రభుత్వం మెట్రో రైలు కోసం ఎన్నో అడ్డంకులు చెబుతూ కాల యాపన చేసింది. తమ ప్రభుత్వ హయాంలోనే మెట్రో రైలు పాతబస్తీలో పరుగులు తీయనుంది. చెప్పింది చేసేదే మా ప్రభుత్వం.

– అలీ మస్కతి, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రచార, ప్రణాళిక కమిటీ కన్వీనర్

ఫలక్‌నుమా నుంచి ఇమ్లిబన్ వరకు..

పాతబస్తీలో 5.5 కిలో మీటర్ల దూరానికి మెట్రో పనులు ప్రారంభించాల్సి ఉంది. పాతబస్తీ ఫలక్‌నుమా నుంచి ఇమ్లిబన్ బస్ డిపో ద్వారా సికింద్రాబాద్ జేబీఎస్ వరకు ఉండే ఈ మెట్రో కారిడార్ పనుల్లో కేవలం ఫలక్‌నుమా నుంచి ఇమ్లిబన్ వరకు మాత్రమే పనులు ఇంకా ప్రారంభం కాలేదు. గతంలో పాతబస్తీలో మెట్రో అలైన్‌మెంట్‌ను మార్చాలనే ఫిర్యాదులు అందడంతో పనులు ఇంకా ప్రారంభించలేకపోతున్నామని సంబంధిత మెట్రో అధికారులు గతంలో చెప్పారు. నగరంలోని ఇతర కారిడార్లలో మెట్రో రైలు పరుగులు తీస్తుండగా..పాతబస్తీలో దాని ఊసే లేదని పాతబస్తీ ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. ఎట్టకేలకు మీరాలం మండి, దారుషిఫా, ఎతేబార్ చౌక్, శాలిబండ, శంషీర్‌గంజ్ ద్వారా ఫలక్‌నుమా వరకు మెట్రో పనులు వేగంగా జరుగనున్నాయి.

పాతబస్తీ మెట్రో లైన్‌పై సీఎం ప్రత్యేక దృష్టి

చాంద్రాయణగుట్ట: సీఎం రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చాక పాతబస్తీ మెట్రో లైన్‌పై ప్రత్యేక దృష్టి సారించినట్లు మెట్రో మేనేజింగ్ డైరెక్టర్ ఎన్వీఎస్ రెడ్డి పేర్కొన్నారు. నేడు పాతబస్తీ మెట్రో పనులకు సంబంధించి ఫలక్‌నుమాలో సీఎం శంకుస్థాపన చేయనున్న నేపథ్యంలో గురువారం ఆయన ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..ఈ మార్గంలో 1100 కట్టడాలను తొలగించాల్సి ఉందని, సీఎం ఆదేశాలతో ఈ రూట్‌లోనే ఉన్న 103 చరిత్రాత్మక, మతపరమైన 103 కట్టడాల జోలికి పోవడం లేదన్నారు. ఈ రూట్‌లో 100 ఫీట్ల రోడ్డును విస్తరించనున్నామని, స్టేషన్ల వద్ద 120 ఫీట్ల మేరకు విస్తరిస్తామన్నారు. మూడేళ్ల పూర్తి చేస్తామన్నారు. దీంతో పాటు నాగోలు నుంచి ఎల్.బి.నగర్, అక్కడి నుంచి ఒవైసీ ఆసుపత్రి మీదుగా చాంద్రాయణగుట్ట, మైలార్‌దేవ్‌పల్లి, పీ–7 జల్‌పల్లి, మామిడిపల్లి మీదుగా విమానాశ్రయం వరకు మెట్రోను నిర్మించేందుకు సిద్ధమయ్యామన్నారు. ఫలక్ను మా నుంచి కూడా చాంద్రాయణగుట్ట వరకు 1.5 కిలోమీటర్ పొడిగించి, చాంద్రాయణగుట్టలో సూపర్ జంక్షన్ ఏర్పాటు చేస్తామన్నారు. బోయ నగేష్, రాజేష్, రవిరాజు, నాయకులు పర్వతాల రాజేందర్, గణేష్ నాయక్, ప్రమోద్‌రెడ్డి పాల్గొన్నారు.

రోడ్లపై వ్యాపారాలు చేయొద్దు



మున్సిపల్ డిప్యూటీ కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తున్న ఆనంద్‌కుమార్ గౌడ్

అబిడ్స్: బేగంబజార్ మచ్చి మార్కెట్‌లో వ్యాపారస్తులు రోడ్లపై వ్యాపారాలు చేయొద్దని, మచ్చిమార్కెట్ లోపలే వ్యాపారాలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకులు ఎం.ఆనంద్‌కుమార్ గౌడ్ డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ సహకారంతో రూ.10 కోట్లు వెచ్చించి బేగంబజార్ మచ్చిమార్కెట్ భవనాన్ని నిర్మించామన్నారు. 14వ సర్కిల్ జీహెచ్ఎంసీ డిప్యూటీ విద్యాధర్‌కు ఆయన మెమోరాండం అందజేశారు. అనంతరం ఆనంద్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ..సమస్యలు పరిష్కరించి వ్యాపారస్తులందరూ. అధునాతనమైన చేపల మార్కెట్‌లో వ్యాపారాలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్లపై వ్యాపారాలు చేయడంతో స్థానిక ప్రజలు, స్థానిక వ్యాపారులు కూడా తీవ్ర అవస్థలు పడుతున్నారన్నారు. ఈ విషయంపై నగర ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రోజ్‌ను కలిసి మచ్చిమార్కెట్ సమస్యపై ఫిర్యాదు చేయనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికలపై అఖిల పక్ష సమావేశం



మాట్లాడుతున్న రోల్ అబ్జర్వర్, పార్లమెంట్ నియోజక వర్గం ఏఆర్‌ఓ వెంకన్న

చార్మినార్: రాబోయే హైదరాబాద్ పార్లమెంట్ ఎన్నికలను పురస్కరించుకుని చార్మినార్ శాసన సభ నియోజకవర్గం ఈఆర్‌ఓ సరిత ఆధ్వర్యంలో అఖిల పక్ష పార్టీల సమావేశం జరిగింది. ఎన్నికల సందర్భంగా ఎక్కడైనా ఓటరు లిస్టులలో పేర్ల నమోదు, తొలగింపు మార్పులు చేర్పులు తదితర అంశాలతో పాటు పోలింగ్ స్టేషన్ల మార్పులు, శిథిలావస్థకు చేరిన భవనాల పరిస్థితులపై ఈ సమావేశంలో చర్చించడం జరిగింది. సమావేశానికి రోల్ అబ్జర్వర్, హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం ఏఆర్‌ఓ, జీహెచ్ఎంసీ చార్మినార్ జోనల్ కమిషనర్ వెంకన్న ముఖ్యఅతిథిగా హాజరై సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పత్తర్‌గట్టి డివిజన్ కార్పొరేటర్ సుహేల్ ఖాద్రీతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు మీర్ హైదర్ అలీ జాఫ్రీ,హాజీ మూసా ఖాసీం, అమన్ షరీఫ్ పాల్గొన్నారు.

బ్రోచర్ ఆవిష్కరణ



సెమినార్ బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ ఆచార్య బాల భాస్కర్

చార్మినార్: ప్రభుత్వ సిటీ కళాశాల భౌతిక శాస్త్ర విభాగం సీఎస్ ఐఆర్, ఢిల్లీ సౌజన్యంతో ఏప్రిల్ 3, 4 తేదీల్లో జాతీయ సదస్సు నిర్వహిస్తున్నదని కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య బాల భాస్కర్ తెలిపారు. ఎనర్జీ మెటీరియల్స్, పరికరాల్లో పురోగతి అనే అంశంపై నిర్వహిస్తున్న సదస్సు బ్రోచర్‌ను గురువారం ఆయన ఆవిష్కరించారు. కార్బన్ ఉద్గారాలను తగ్గించడం, సుస్థిర జీవనం కోసం కొత్త పదార్థాలను సృష్టించడం చాలా కీలకమని, పర్యావరణ హితమైన పదార్థాలు అవసరమని, ఈ విషయమై ఈ సదస్సులో లోతైన చర్చలు జరుగుతాయని అన్నారు. డా.నైన వినోదిని చైర్మన్‌గా, డా.కె.పర్వతాలు సమన్వయకర్తగా నిర్వహిస్తున్న ఈ సదస్సులో సీఎస్ ఐఆర్ నుంచి ముగ్గురు శాస్త్రవేత్తలు ప్రధాన వక్తలుగా పాల్గొంటారని, దేశవిదేశాల శాస్త్రవేత్తలు, వివిధ విశ్వవిద్యాలయాల, కళాశాల ఆచార్యులు, పరిశోధక విద్యార్థుల నుంచి పత్రాలను ఆహ్వానిస్తున్నామని, డిగ్రీ, పిజి విద్యార్థులు పోస్టర్ ప్రెజెంటేషన్ లో పాల్గొనవచ్చని అన్నారు. సదస్సు కరపత్రం ఆవిష్కరణలో డా.వాసుదేవరెడ్డి, డా.నీరజ, డా.చిన్నికృష్ణ, డా.లక్ష్మీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

గంజాయి కేసులో నిందితుడి అక్రమ ఆస్తుల జప్తు

లంగర్‌హౌస్: గంజాయి విక్రయిస్తూ పట్టుబడిన వ్యక్తికి చెందిన రూ. 96 లక్షల విలువైన ఆస్తులను నార్కోటిక్ యాక్ట్, ఎన్‌డీపీఎస్ సెక్షన్ 68 ప్రకారం అధికారులు స్వాధీనం జప్తు చేశారు. సౌత్‌వెస్ట్ డీసీపీ ఉదయ్‌కుమార్ రెడ్డి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మహబూబాబాద్ జిల్లా, శివనాయక్ తాండాకు చెందిన వాంకుడోత్ వీరన్న అలియాస్ వీరు నగరానికి గంజాయి తెచ్చి విక్రయించేవాడు. దీనిపై సమాచారం అందడంతో పోలీసులు 2023 ఆగస్టు 17 న అతడిని అదుపులోకి తీసుకుని 44 కేజీల గంజాయి సీజ్ చేశారు. అతడితో పాటు అజ్మీర్ వీరన్న అలియాస్ లాలు, సుర్నేని మనోజ్ అలియాస్ మణిని అరెస్టు చేసి జైలుకు పంపారు. ఈ కేసుపై విచారణ చేపట్టిన లంగర్‌హౌస్ పోలీసులు, టీఎస్ఎన్ఏబి అధికారులు గంజాయి విక్రయాల ద్వారా వీరన్న అక్రమంగా ఆస్తులు కూడబెట్టినట్లు నిర్ధారించారు. దీంతో ఇబ్రహీంపట్నం, హనుమకొండ, మహబూబాబాద్‌లలో నాలుగు వాహనాలను, మహబూబాబాద్‌లోని ఇంటిని జప్తు చేశారు. అటాచ్ చేసిన ఆస్తుల విలువ రూ.96,55,498 ఉంటుందని పోలీసులు తెలిపారు. ఇకపై డగ్స్, గంజాయి విక్రయించినా, సేవించినా కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

సుల్తాన్‌బజార్: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శుక్రవారం కింగ్‌కోఠి కామినేని ఆసుపత్రిలో ఉచిత రక్తదాన, సాధారణ ఆరోగ్య పరీక్షలను నిర్వహించనున్నట్లు కామినేని ఆసుపత్రి చైర్మన్ కామినేని సూర్యనారాయణ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మార్చి 8వ తేదీ నుంచి 15వ తేదీ వరకు మహిళలకు అన్నిరకాల టెస్టులు, స్కానింగ్‌లు ఉచితంగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు 98159 98159లో సంప్రదించాలన్నారు.

సన్మానం



చార్మినార్: రాజ్యసభ సభ్యుడు ఎం.అనిల్‌కుమార్ యాదవ్‌ను ప్రముఖ రియల్టర్ కోటిరెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి బొకే అందజేసి శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. పాతబస్తీ దూద్‌బౌలిలోని ఆయన ఇంటికి వెళ్లి శుభాకాంక్షలు తెలియజేశారు.

కదిలే శివలింగం



చార్మినార్: ప్రపంచంలోనే మొదటిసారి కదిలే శివ లింగాన్ని రూపొందించారు బహదూర్‌పురాలోని సుధా కార్స్ మ్యూజియం అధినేత సుధాకర్. మహాశివరాత్రి సందర్భంగా 4 వీల్స్‌తో కూడిన 60 సీసీ ఇంజన్ కెపాసిటీతో గంటకు 50 కిలో మీటర్ల వేగంతో పరుగులు తీసే ఈ పరుగెత్తే శివలింగాన్ని 12 నెలల్లో తయారు చేసినట్లు ఆయన తెలిపారు. మెటల్ బాడీతో చేతితో తయారు చేసిన ఈ శివ లింగాన్ని తమ మ్యూజియంలో సందర్శకులకు అందుబాటులో ఉంచినట్లు ఆయన తెలిపారు.

చోరీలకు పాల్పడుతున్న ఇద్దరి అరెస్ట్

హిమాయత్‌నగర్: చోరీలకు పాల్పడుతున్న ఇద్దరిని నగర సీసీఎస్ స్పెషల్ జోన్ క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. జియాగూడకు చెందిన గోపి అరుణ్ (21), బూరె సాయినాథ్ (20) ఇద్దరు స్నేహితులు. ఈజీ మనీ కోసం దొంగతనాలకు పాల్పడుతున్నారు. పార్క్ చేసిన బైక్‌లను, మొబైల్ ఫోన్లను దొంగిలించి, వాటిని బ్లాక్ మార్కెట్‌లో విక్రయిస్తుంటారు. నాంపల్లిలో దొంగిలించి బైక్‌ను వదిలి వెళ్తుండగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితులపై కుల్సుంపుర, టపాచబుత్రా, మాదాపూర్ పోలీస్ స్టేషన్లలో పలు దొంగతనం కేసులు ఉన్నాయి. ఇద్దరిని మాదాపూర్ పోలీసులు అప్పగించారు. నిందితుల వద్ద నుంచి రూ.10 లక్షలు విలువ చేసే 5 బైక్‌లు, 3 ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ చోరీ కేసుల్లో పరారీలో ఉన్న మరో ఇద్దరు నిందితులు యుగ్, జిత్తుల కోసం గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పెండింగ్ జీతాలు చెల్లించాలని ఆందోళన



ఎన్‌హెచ్ఎం కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

సుల్తాన్‌బజార్: నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్ఎం) స్కీమ్‌లో రాష్ట్రవ్యాప్తంగా పనిచేస్తున్న దాదాపు 17 వేల మంది కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల పెండింగ్‌లో ఉన్న జీతాలను చెల్లించాలని ఎన్‌హెచ్ఎం కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర అధ్యక్షుడు ఎం.నర్సింహా డిమాండ్ చేశారు. గురువారం కోఠిలోని ఎన్‌హెచ్ఎం డైరెక్టరేట్ కార్యాలయం ఎదుట ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..ఫీల్డ్ లెవల్‌లో ప్రజలకు సేవలందిస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు మంచిపేరు తీసుకువస్తే విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు మూడు నెలలుగా జీతాలు లేకపోవడంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. రామస్వామి, గోపాల్‌రెడ్డి, పద్మ, బాలసుబ్రమణ్యం, సువర్ణ, జయమ్మ, సుజాత, విజయలక్ష్మి పాల్గొన్నారు.

పల్లె దవాఖానా వైద్యులు ఆందోళన..

పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని ప్రభుత్వ పల్లె దవాఖానా వైద్యులు కోఠిలోని ఎన్‌హెచ్ఎం కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. రాష్ట్రవ్యాప్తంగా 1200 మంది డాక్టర్లు పల్లె దవాఖానాలో పనిచేస్తున్నారని వారికి పెండింగ్‌లో ఉన్న జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వెంకన్న, డాక్టర్ మహేందర్, డాక్టర్ శ్రీనివాస్, సింధుజ, సమంత, సంగీత పాల్గొన్నారు.

సత్కారం



ఓబేదుల్లా కొత్వాల్‌ను సన్మానిస్తున్న వెంకటేశ్

గౌలిపురా: తెలంగాణ రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ నూతన చైర్మన్‌గా నియమితులైన ఓబేదుల్లా కొత్వాల్‌ను కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, చార్మినార్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ మాజీ ఇన్‌చార్జి కె.వెంకటేశ్ గురువారం కలిసి ఘనంగా సన్మానించారు. నాంపల్లిలోని హజ్ భవనంలో మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన ఓబేదుల్లా కొత్వాల్‌ను వెంకటేశ్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

ఫైర్ ఎస్టింగిషర్ వాడకంపై అవగాహన



గోల్కొండ: అత్యవసర పరిస్థితుల్లో ఫైర్ ఎస్టింగిషర్‌లను వాడే విధానంపై ఆసుపత్రిలోని సిబ్బందికి తెలిసి ఉండాలని లంగర్‌హౌస్ ఫైర్ స్టేషన్ ఆఫీసర్ దత్తు అన్నారు. గురువారం గోల్కొండ ఏరియా ఆసుపత్రిలో అత్యవసర పరిస్థితులు–మంటలు ఆర్పే విధానంపై జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చిన్న అగ్ని ప్రమాదం సంభవించిన ఆందోళన చెందొద్దన్నారు. ఈ సందర్భంగా ఆయన ఫైర్ ఎస్టింగిషర్‌లోని వివిధ బటన్స్‌ను వివరించి అది వాడే విధానాన్ని వివరించారు. కార్యక్రమంలో గోల్కొండ ఏరియా ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ మహ్మద్ మజహరుల్లా, ఆర్ఎంఓ డాక్టర్ వినాయక్‌రావు, లీడింగ్ ఫైర్ ఆఫీసర్ ఏ.బాలరాజ్, డ్రైవర్ ఆపరేటర్ జమీల్, ఫైర్‌మెన్ సురేందర్ తదితరులున్నారు.

మేరు కులస్తులకు ఎంపీ టికెట్లు ఇవ్వండి



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న పోల్కం శ్రీనివాస్


అబిడ్స్: లక్షలాది మంది ఉన్న మేరు కులస్తులకు పార్లమెంట్ ఎన్నికల్లో టికెట్లు కేటాయించాలని రాష్ట్ర కాంగ్రెస్ ఓబీసీ సెల్ జనరల్ సెక్రెటరి పోల్కం శ్రీనివాస్ పేర్కొన్నారు. గురువారం మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. మల్కాజ్‌గిరి పార్లమెంట్ స్థానాన్ని తమకు కేటాయించాలని పోల్కం శ్రీనివాస్ పేర్కొన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో కూడా తమ కులస్తులకు టికెట్లు ఇవ్వలేదన్నారు. తనకు టికెట్ కేటాయిస్తే మల్కాజ్‌గిరిలో భారీ మెజార్టీతో విజయం సాధిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మునగల రాములు, శంభు విష్ణు, మునిగాల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆలే లలితా నరేంద్రను కలిసిన మాధవీలత



గౌలిపురా: బీజేపీ హైదరాబాద్ పార్లమెంటు అభ్యర్థి మాధవీలత గురువారం గౌలిపురాలోని ఆలే నరేంద్ర నివాసానికి చేరుకొని మాజీ కార్పొరేటర్ ఆలే లలితా నరేంద్రను మర్యాదపూర్వకంగా కలిశారు. మాధవీలత ఆలే లలితా నరేంద్ర ఆశీస్సులు తీసుకొని పార్లమెంటు ఎన్నికలకు సంబంధించి పలు విషయాలు చర్చించి వారి సలహాలు, సూచనలు తీసుకున్నారు. ఇ.సుమన్‌కుమార్ ముదిరాజ్, ఎం.వెంకటేశ్, జి.రఘుకాంత్, జి.ఎం. జ్యోతి కుమార్, జమాల్‌పూర్ అశోక్ పాల్గొన్నారు.

10 నుంచి గ్లకోమా వారోత్సవం



గోల్కొండ: గ్లకోమా జబ్బుకు ముందస్తు రోగ నిర్ధారణ చేయడం ఉత్తమమని సరోజినీదేవి కంటి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి.రాజలింగం అన్నారు. గురువారం సరోజినీదేవీ కంటి ఆసుపత్రిలో జరిగిన ప్రెస్‌మీట్‌లో ఈనెల 10 నుంచి ప్రారంభం కానున్న గ్లకోమా వారోత్సవాల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత దశాబ్ద కాలంగా తాము గ్లకోమా వారోత్సవాలను నిర్వహిస్తూ ప్రమాదకరమైన గ్లకోమా వ్యాధిపై వివిధ కార్యక్రమాల ద్వారా ప్రజలకు తెలియజేస్తున్నామన్నారు. ఇందులో భాగంగానే ఈ నెల 10వ తేదీ నుంచి 16వ తేదీ వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. 10వ తేదీన జరిగే వరల్డ్ గ్లకోమా అవేర్‌నెస్ వాక్‌లో రాష్ట్ర ఆరోగ్య మంత్రి సి.దామోదరరాజనర్సింహ్మా ముఖ్య అతిథిగా పాల్గొంటారన్నారు. గ్లకోమా వారోత్సవాల్లో మొదటి రోజు పబ్లిక్ అవేర్‌నెస్ కార్యక్రమాలు, రెండవ రోజు ర్యాలీలు, 3వ రోజు సెమినార్, 4వ రోజు స్లోగన్స్ అండ్ పోస్టర్స్ పోటీలు, 5వ రోజు మీడియా పబ్లిసిటీ, 6వ రోజు పేషంట్స్ ఎడ్యుకేషన్ ప్రొగ్రామ్, చివరి రోజు గ్లకోమా స్క్రీనింగ్ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి ఆర్ఎంఓ డాక్టర్ నజాఫీ తదితరులున్నారు.

హైదరాబాద్‌లో మజ్లిస్‌ను ఓడిస్తాం



మాధవీలతను సన్మానిస్తున్న పాండు యాదవ్, మాణిక్ ప్రభు, ముక్క కృష్ణాగుప్తా

అబిడ్స్: హైదరాబాద్ పార్లమెంట్‌లో మజ్లిస్‌ను చిత్తుగా ఓడించి బీజేపీ జెండా ఎగరవేస్తానని హైదరాబాద్ బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ మాధవీలత పేర్కొన్నారు. గోషామహల్ నియోజకవర్గానికి చెందిన బీజేపీ గోల్కొండ జిల్లా అధ్యక్షులు వి.పాండు యాదవ్, కిసాన్‌మోర్చా అధ్యక్షుడు మాణిక్ ప్రభు, ప్రధాన కార్యదర్శి ముక్కా కృష్ణాగుప్తా, అధికార ప్రతినిధి శశికాంత్ కులకర్ణిలతో పాటు పలువురు నాయకులు ఘనంగా సత్కరించారు. మాధవీలత మాట్లాడుతూ..మైనార్టీ ఓట్లతో విజయం సాధిస్తున్న ఒవైసీ మైనార్టీలకు ఎలాంటి అభివృద్ధి చేయలన్నారు. ఈ కార్యక్రమంలో యమన్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం



జీఎన్ఐటీఎస్‌లో మహిళా దినోత్సవ తీర్మానాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం



వేడుకల్లో కళాశాల చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు



ఉపాధ్యాయురాలిని సన్మానిస్తున్న డిప్యూటీ ఐఓఎస్ హరి నారాయణ

అబిడ్స్: జాగృతి కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. గురువారం కళాశాలలో అధ్యాపకులు, లెక్చరర్‌లు, విద్యార్థులు కేక్ కట్‌చేసి సంబరాలు చేశారు. కళాశాల చైర్మన్ ముఖ్యఅతిథిగా పాల్గొని సంబరాలు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..మహిళలు అన్నిరంగాల్లో రాణించే విధంగా కృషి చేయాలన్నారు.

మహిళా సాధికారతకు రిజర్వేషన్లు అమలు చేయాలి..

యాకుత్‌పురా: అంతర్జాతీయా మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని హరిబౌలిలోని ప్రభుత్వ రిఫాయే-అం-ఉన్నత పాఠశాలలో గురువారం ప్రత్యేక కార్యక్రమంలో నిర్వహించారు. విద్యాశాఖ బహదూర్‌పురా డిప్యూటీ ఐఓఎస్ హరి నారాయణ ముఖ్యఅతిథిగా హాజరై మండల పరిధిలోని పలు పాఠశాలలో విధులు నిర్వహిస్తూ సేవలాందిస్తున్న మహిళా ఉపాధ్యాయులను ఆయన సన్మానించారు. ప్రధనోపాధ్యాయులు మధుసూధన్, వెంకట్రావ్ స్మారకోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రేణు, హౌకా అధ్యక్షులు డాక్టర్ విజయ్ భాస్కర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహిళలు హక్కుల సాధనకు పోరాడాలి

గోల్కొండ: మహిళలు తమ హక్కుల సాధన కోసం నిరంతరం పోరాటం చేస్తూనే ఉండాలని ఎలికో వైస్ చైర్‌పర్సన్ వనిత దాట్ల అన్నారు. గురువారం షేక్‌పేట్‌లోని జి.నారాయణమ్మ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో రెండు రోజుల ఉమెన్స్ లీడర్ షిప్ కాన్‌క్లేవ్-2024 సదస్సు ముగింపు కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. జీఎన్ఐటీఎస్ చైర్మన్ జి.రాఘవరెడ్డి, వైస్ చైర్మన్ జి.శ్రీవిద్యరెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రమేష్‌రెడ్డి, స్టూడెంట్స్ అఫైర్స్ డీన్ డాక్టర్ అపర్ణ, ఇషిత దోనిపర్తి, ఐశ్వర్య పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ సేవలు ప్రశంసనీయం

నిలోఫర్ ఆస్పత్రికి రూ.50 లక్షల విలువ చేసే పరికరాలు



పరికరాల వార్డును ప్రారంభిస్తున్న మంత్రి సీతక్క

నాంపల్లి: నవజాత శిశు సంరక్షణ కేంద్రం నిలోఫర్ ఆస్పత్రి ఎస్ఎన్‌సీయూ నియోనటాలజీ వార్డులో అధునాతన అదనపు పరికరాలను సమకూర్చారు. రూ.50 లక్షల విలువ చేసే ఫొటో థెరపీ-10 మిషన్లు, పల్స్ ఆక్సీమీటర్లు-13, మానిటర్లు-2, 2డి ఈకో-1 మిషన్‌ను రోటరీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ మావెరిక్స్ విరాళంగా అందజేశారు. ఆధునిక పరికరాలను సమకూర్చిన వార్డును గురువారం రాష్ట్ర మంత్రి సీతక్క ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆస్పత్రుల్లో పేద రోగులకు ఆధునిక వైద్యాన్ని అందజేయడానికి సహకరిస్తున్న రోటరీ క్లబ్‌కు అభినందనలు తెలియజేశారు. కష్టం వచ్చినప్పుడు అందరికీ గుర్తుకు వచ్చేది రోటరీ క్లబ్ అని ఆమె గుర్తు చేశారు. వైద్యం లేని ప్రాంతంలో అంబులెన్స్‌ను సమకూర్చారని ప్రశంసించారు. మా దృష్టిలో రోటరీ క్లబ్‌కు అపారమైన గౌరవం ఉందన్నారు. ప్రతి ఒక్కరూ ఇలాంటి సేవలను గౌరవించాల్సిందేనని చెప్పారు. మంచి మనసుతో సేవలందిస్తున్న రోటరీ క్లబ్ ఆఫ్ హైదరాబాదు మావెరిక్స్‌కు ప్రభుత్వం నుంచి ఎలాంటి సహాయ సహకారాలు అవసరం ఉన్నా సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని మాటిచ్చారు. కార్యక్రమంలో డీఎంఈ డాక్టర్ ఎన్.వాణి, నిలోఫర్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఉషారాణి, సీఎస్ ఆర్ఎంఓ డాక్టర్ జ్యోతి, రోటరీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ మావెరిక్స్ అధ్యక్షులు పి.వారణాసి, జి.శ్రీవర్ధన్, కార్యదర్శులు డి.లక్ష్మీనారాయణ, ఎన్.వెంకటరాజు తదితరులు పాల్గొన్నారు.